# సైబర్ నేరాల నియంత్రణకు వార్ రూమ్

**1930 కాల్స్‌పై అరగంటలోనే వేగవంతమైన చర్యలు**

**జిల్లాల్లో టెక్ కానిస్టేబుళ్లతో 'క్లిక్' టీమ్‌లు రంగంలోకి**

**డీజీపీ హరీష్ కుమార్ గుప్తా**

**రాజమహేంద్రవరం (సమయం న్యూస్):** రాష్ట్రంలో అమాయకులను ముంచేస్తున్న సైబర్ నేరగాళ్ల ఆటకట్టించేందుకు రాష్ట్ర స్థాయిలో 'సైబర్ వార్ రూమ్', జిల్లా స్థాయిలో 'క్లిక్' టీమ్‌లను రంగంలోకి దించుతున్నట్లు ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ప్రకటించారు. రాజమహేంద్రవరం లాలాచెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సైబర్ నేరాల నియంత్రణ, గోదావరి పుష్కరాల బందోబస్తు ఏర్పాట్లు, రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కేసుల దర్యాప్తు పురోగతిపై సమగ్ర వివరాలను వెల్లడించారు. బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించేందుకు ఇన్వెస్టిగేషన్ టీమ్‌లు, బ్యాంకర్లు, టెలికాం ఆపరేటర్ల ప్రతినిధులతో కూడిన 'సైబర్ వార్ రూమ్'ను రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేస్తున్నామని డీజీపీ తెలిపారు. సైబర్ మోసం జరిగిన తొలి 30 నిమిషాలను 'గోల్డెన్ పీరియడ్'గా పరిగణించి, బాధితుల సొమ్మును రక్షించేందుకు నిందితులు నగదు బదిలీ చేసిన అకౌంట్లను వెనువెంటనే ఫ్రీజ్ చేస్తామన్నారు. జిల్లా స్థాయిలో ఎస్పీల పర్యవేక్షణలో బీటెక్, ఎంటెక్, ఎంసీఏ వంటి సాంకేతిక విద్యార్హతలు కలిగిన 20 మంది కానిస్టేబుళ్లతో 'క్లిక్' పేరిట ప్రత్యేక సైబర్ విభాగాలు పనిచేస్తాయని చెప్పారు. డిజిటల్ ఫోరెన్సిక్ పరికరాల వాడకంతో పాటు అవసరమైతే ప్రైవేట్ ల్యాబ్‌లతో ఒప్పందాలు చేసుకుంటామని, నిపుణులను కాంట్రాక్ట్ లేదా ఔట్‌సోర్సింగ్ విధానంలో నియమిస్తామని స్పష్టం చేశారు.



**పుష్కరాలకు తిరుమల తరహా భద్రత..**

రాబోయే గోదావరి పుష్కరాల బందోబస్తు ప్రణాళికను వివరిస్తూ.. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఆధునిక ఏఐ టెక్నాలజీ, డ్రోన్ల సహాయంతో ఘాట్ల వద్ద భక్తుల రద్దీని ముందస్తుగానే అంచనా వేస్తామని డీజీపీ తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనంలో ఉపయోగించే కంపార్ట్‌మెంట్ విధానం తరహాలోనే ఏ ఘాట్ వద్ద ఎంత రద్దీ ఉందో ఎప్పటికప్పుడు గమనిస్తూ భక్తులను ఇతర ఘాట్లకు క్రమబద్ధీకరిస్తామన్నారు. రాజమండ్రి నగరంలో 2 వేలకు పైగా సీసీటీవీ కెమెరాలను నిరంతర రికార్డింగ్ మోడ్‌లో ఉంచి, కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

**ప్రియాంక కేసుపై ప్రత్యేక దృష్టి..**

డాక్టర్ ప్రియాంక మృతి ఘటనపై డీజీపీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కేసు దర్యాప్తును ఉన్నతాధికారులు చాలా సీరియస్‌గా పర్యవేక్షిస్తున్నారని, ప్రత్యేక కోర్టు ద్వారా విచారణ జరిపించి నిందితులకు త్వరగా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానాలు ఉన్నా నేరుగా నివృత్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో లవ్ జిహాద్ జరుగుతోందంటూ వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. ఇప్పటివరకు పోలీసు శాఖ చేపట్టిన దర్యాప్తులో అలాంటి ఆధారాలేవీ లభించలేదని తేల్చిచెప్పారు

# రూ.253 కోట్లతో అతిపెద్ద ఫోరెన్సిక్ ల్యాబ్!

**రాజధాని తుళ్లూరులో భారీ నిర్మాణం**

**దేశంలోనే నంబర్ వన్ స్టేట్ ల్యాబ్‌గా రికార్డు**

**ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వెల్లడి**

**అమరావతి (సమయం న్యూస్):** పోలీసు నేర పరిశోధనకు రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలు వెన్నెముక వంటివని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలోని తుళ్లూరులో రూ.253 కోట్ల అంచనా వ్యయంతో, 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద స్టేట్ లెవల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను నిర్మిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. రాజమండ్రిలో పర్యటించిన సందర్భంగా ఆయన ఫోరెన్సిక్ సేవల విస్తరణ, ఆధునికీకరణపై కీలక వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా నేర పరిశోధన విభాగాన్ని పటిష్టం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు డీజీపీ తెలిపారు. ఇందులో భాగంగా రాజమండ్రి, తిరుపతి, అనంతపురం, విశాఖపట్నం సహా పలు కీలక కేంద్రాల్లోని ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లను అత్యాధునిక హంగులతో ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. తద్వారా శాస్త్రీయ ఆధారాల సేకరణ, పరిశోధన ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా పోలీసులకు తక్షణ సాయం అందుతుందన్నారు. క్లిష్టమైన కేసుల ఛేదనలో అత్యంత కీలకమైన డీఎన్ఏ నివేదికలను చాలా వేగంగా అందజేస్తున్నామని డీజీపీ పేర్కొన్నారు. సాధారణ కేసుల్లో డీఎన్ఏ నివేదికలను కేవలం 7 రోజుల్లోనే అందిస్తుండగా, అత్యంత ప్రాధాన్యత కలిగిన కీలక కేసుల్లో రికార్డు స్థాయిలో 13 గంటల వ్యవధిలోనే ఇచ్చేలా వ్యవస్థను తీర్చిదిద్దామని వివరించారు. అత్యాధునిక ఫోరెన్సిక్ సదుపాయాలతో నిందితులకు సత్వరమే శిక్షలు పడేలా ఆధారాలను న్యాయస్థానాలకు సమర్పిస్తున్నట్లు తెలిపారు.

# నా డ్యాన్స్‌తో ఉన్న ఏఐ వీడియో చూసి ఆశ్చర్యపోయా

**మోహన్‌లాల్, విజయ్ కంటే నేనే మంచి డ్యాన్సర్**

**కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ సరదా వ్యాఖ్య**

**కేరళ (సమయం న్యూస్):** కేఎస్ఈబీ ఉద్యోగులతో కలిసి తాను నృత్యం చేస్తున్నట్లుగా ఉన్న ఒక కృత్రిమ మేధ (ఏఐ) వీడియోను చూసి దిగ్భ్రాంతికి గురయ్యానని కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అన్నారు. అయితే, ఆ టెక్నాలజీ పుణ్యమా అని తాను ప్రముఖ నటులు మోహన్‌లాల్, సీఎం విజయ్ కంటే మెరుగ్గా డ్యాన్స్ చేశానని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. శనివారం కేరళ జ్యుడీషియల్ అకాడమీ, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో సతీశన్ ప్రసంగించారు. సినిమా, సంగీత రంగాల్లో కాపీరైట్ హక్కుల పరిరక్షణ, డిజిటల్ టెక్నాలజీ సవాళ్లు అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తన అనుభవాన్నే ఉదాహరణగా చూపుతూ, "ఆ వీడియో చూసి నేను షాక్ అయ్యాను. అందులో నేను మోహన్‌లాల్, విజయ్ కంటే బాగా డ్యాన్స్ చేస్తున్నట్లు అనిపించింది" అని సాంకేతిక పరిజ్ఞాన వేగానికి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేరళ తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటూ, ప్రభుత్వంపై విమర్శలు వస్తున్న సమయంలో ఈ ఏఐ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

# బాబు చేతుల్లో ఏపీ భద్రం!

(మొదటిపేజీ తరువాయి..)

చంద్రబాబు చెప్పిన 'వంటిల్లే ఫార్మసీ.. ఆహారమే ఔషధం' అన్న విధానం నూటికి 100 శాతం నిజమని, జీవనశైలి మార్పులతోనే వ్యాధుల నివారణ సాధ్యమని నడ్డా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అత్యంత సురక్షితమైన చేతుల్లో ఉందని జేపీ నడ్డా ప్రశంసించారు. చంద్రబాబు అపారమైన విజన్, నిబద్ధత కలిగిన నాయకుడని, ఉమ్మడితో పాటు విభజిత ఏపీ అభివృద్ధిలో ఆయన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో సీఎం చూపుతున్న చిత్తశుద్ధిని ఆయన అభినందించారు. పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ, హంద్రీ-నీవా వంటి ప్రాజెక్టులను పరుగులు పెట్టించడం హర్షణీయమని, నీటి వనరుల సమర్థ వినియోగంతోనే రాష్ట్రం మరింత ప్రగతి సాధిస్తుందని తెలిపారు.




# జనవరి 1 నుంచి హెల్త్ డిజిటలైజేషన్!

- **రూ.249 కోట్లతో 22 ఆరోగ్య ప్రాజెక్టులు ప్రారంభం**
- **కేంద్ర మంత్రి నడ్డా, సీఎం చంద్రబాబు శ్రీకారం**

**విజయవాడ (సమయం న్యూస్):** వైద్యారోగ్య రంగంలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ప్రజల హెల్త్ రికార్డులను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయనున్నట్లు వెల్లడించారు. విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్, ల్యాబరేటరీని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ కళావేదిక వేదికగా రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల వ్యయంతో సిద్ధం చేసిన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 సమగ్ర పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను వర్చువల్ విధానంలో లాంఛ్ చేశారు. దీని ద్వారా రాష్ట్రంలో అదనంగా 500 క్రిటికల్ కేర్ పడకలు, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు పేదలకు అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కూడిన



డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వల్లే రాష్ట్రంలో విప్లవాత్మక అభివృద్ధి సాధ్యమవుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో దేశంలో మెడికల్ సీట్లను 51 వేల నుంచి రెండింతలకు పైగా పెంచిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు. ప్రజలు తమ వంటశాలలను ఫార్మసీగా, ఆహారాన్నే ఔషధంగా మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. యోగా, ప్రాణాయామం వంటి సంప్రదాయ పద్ధతులతో పాటు ఆధునిక సాంకేతికతను సమపాళ్లలో పాటిస్తే ఆరోగ్య సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ 1 స్థానంలో నిలపడమే తమ ధ్యేయమని తేల్చిచెప్పారు.

అమరావతిని భవిష్యత్ సాంకేతిక కేంద్రంగా మారుస్తున్నామని, ఇక్కడ ఏర్పాటు చేయనున్న క్వాంటం బయో వ్యాలీకి జాతీయ ప్రాజెక్టుగా గుర్తింపు ఇవ్వాలని కేంద్ర మంత్రి నడ్డాను చంద్రబాబు కోరారు. దేశంలోనే మొట్టమొదటి క్వాంటం కంప్యూటర్ అమరావతిలోనే కొలువుదీరనుందని తెలిపారు. సాంకేతికతను ఒడిసిపడితే రాబోయే 10 ఏళ్లలో రాష్ట్రం అద్భుత ప్రగతిని సాధిస్తుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విభాగంలో యువతకు విస్తృత శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

**సభలో సెల్ఫీ సందడి..**

సభ ముగిసిన అనంతరం వేదికపై నుంచే కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో కలిసి సీఎం చంద్రబాబు సెల్ఫీ దిగి సభికులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమ, నేత సోము వీర్రాజుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బాబు విజన్ అమోఘం!

- **సీఎం, ఆరోగ్య మంత్రిపై కేంద్ర మంత్రి ప్రశంసల జల్లు**
- **రాష్ట్రంలో టీకా కార్యక్రమం అమలు భేష్**
- **మంత్రి సత్యకుమార్ చొరవపై నడ్డా హర్షం**

**అమరావతి (సమయం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య రంగం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నాయకత్వంలో సురక్షిత చేతుల్లో ఉందని కేంద్ర మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా ప్రశంసించారు. నూతన క్రిటికల్ కేర్ బ్లాకులు, సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి సత్యకుమార్‌లపై ప్రశంసల జల్లు కురిపించారు. రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపడుతున్న వివిధ కార్యక్రమాలను నడ్డా అభినందించారు. చంద్రబాబు నాయకత్వంపై, సత్యకుమార్ కృషిపై తనకు పూర్తి విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. వారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య రంగంలో దేశంలోనే ముందంజలో నిలుస్తుందన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వ్యాధుల నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అద్భుతంగా ఉన్నాయన్నారు.

రాష్ట్రంలో టీకా కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న తీరును కేంద్ర మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో ప్రభుత్వంతో పాటు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతో తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర ఆరోగ్య రంగానికి సరికొత్త దిశను చూపుతున్నాయని నడ్డా పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో వైద్య వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**సత్యకుమార్ చొరవపై నమ్మకం..**

వైద్య ఆరోగ్య శాఖను సమర్థంగా ముందుకు నడిపిస్తున్న



మంత్రి సత్యకుమార్ యాదవ్ కృషిని కూడా నడ్డా ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రశంసించారు. సత్యకుమార్ చొరవతోనే పలు ఆరోగ్య కార్యక్రమాలు రాష్ట్రంలో వేగంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఆయన పనితీరుపై తనకు పూర్తి విశ్వాసం ఉందని కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పష్టం చేశారు.

# మెగా డీఎస్సీ పారదర్శకం

- **148 రోజుల్లోనే 16,347 పోస్టుల భర్తీ**
- **నిరుద్యోగులను అడ్డుకునేలా 335 పిటిషన్లు**
- **వైసీపీకి హైకోర్టు తీర్పు చెంపపెట్టు: మంత్రి దుర్గేష్**

**విజయవాడ (సమయం న్యూస్):** రాష్ట్రంలో మెగా డీఎస్సీ ప్రక్రియను కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా పూర్తి చేసిందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. గత కొన్ని రోజులుగా డీఎస్సీ నియామకాలపై అభూత కల్పనలు సృష్టిస్తూ విషప్రచారం చేస్తున్న వైఎస్సార్సీపీ తీరును జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. శనివారం విజయవాడ తూర్పు నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ నిరుద్యోగులకు అండగా నిలిచిందని పేర్కొన్నారు.

**వైసీపీ కుట్రలకు హైకోర్టు చెంపపెట్టు..**

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దక్కకూడదనే దుర్బుద్ధితో వైఎస్సార్సీపీ నేతలు ఏకంగా 335 పిటిషన్లను హైకోర్టులో దాఖలు చేశారని మంత్రి దుర్గేష్ మండిపడ్డారు. వైసీపీ ఎమ్మెల్సీ దాఖలు చేసిన పిల్ పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. బాధిత అభ్యర్థులు ఎవరూ కోర్టుకు రానప్పుడు మీకెందుకు ఇంత ఆరాటం అంటూ తీవ్రంగా మందలించిందని గుర్తు చేశారు. ఈ తీర్పు వైసీపీ నాయకులకు గట్టి చెంపపెట్టు వంటిదని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన వెంటనే చేసిన మొదటి సంతకం మెగా డీఎస్సీ ఫైలుపైనేనని, కేవలం 148 రోజుల రికార్డు వ్యవధిలోనే 16,347 పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేసి కూటమి



ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుందని వివరించారు.

**నిబంధనల మేరకే ఎంపికలు..**

నోటిఫికేషన్ విడుదల మొదలుకొని మెరిట్ జాబితాలు, ప్రాథమిక కీలు, అభ్యంతరాల పరిష్కారం వరకు ప్రతి అంశాన్ని ప్రజల ముందు ఉంచామని మంత్రి వెల్లడించారు. కేవలం మెరిట్ ర్యాంకు మాత్రమే కాకుండా అభ్యర్థి కేటగిరీ, ఖాళీల లభ్యత, రోస్టర్ పద్ధతి, హారిజంటల్ రిజర్వేషన్లతో పాటు మహిళలు, దివ్యాంగులు, క్రీడాకారులు, మాజీ సైనికుల నిబంధనలకు కట్టుబడి పక్కాగా తుది ఎంపికలు చేపట్టామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ, ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఏషియా గుర్తించిన వ్యూహాత్మక క్రీడ అయిన 'బ్రిడ్జ్' పై వైసీపీ నేతలు ఎలాంటి అవగాహన లేకుండా రాద్ధాంతం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆ ఆట ప్రాధాన్యత తెలియకుండా ప్రభుత్వంపై నిందలు వేయడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు.

**త్వరలోనే మరో డీఎస్సీ..**

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్స్ పరీక్షల నిర్వహణలో ఘోరంగా విఫలమై నిరుద్యోగులను మోసం చేశారని కందుల దుర్గేష్ ధ్వజమెత్తారు. జాబ్ క్యాలెండర్ పేరిట ఐదేళ్ల పాటు కాలయాపన చేస్తూ నాడు పరీక్షలు రాసిన అభ్యర్థులకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. అలాంటి పార్టీ నేడు మెగా డీఎస్సీపై నిరాధార ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే కాకుండా, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ త్వరలోనే మరో డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించడంతో యువతలో సరికొత్త ఆశలు చిగురించాయని తెలిపారు. రాజకీయ ఉనికి కోల్పోతామనే భయంతో రాత్రింబవళ్లు కష్టపడి కొలువులు సాధించిన వేలాది మంది అభ్యర్థుల శ్రమను వైసీపీ అవమానిస్తోందని, తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# ఒకరు వెళితే వెయ్యి మందిని తెస్తాం!

- వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నడూ వెనుకడుగు వేయరు
- భీమిలి భూ వ్యవహారాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి
- కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డ ప్రతిపక్ష నేతలు



**భీమిలి (సమయం న్యూస్):** భీమిలి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన కేడర్ ఉందని, రాబోయే ఎన్నికల్లో ఐక్యంగా పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు. తగరపువలసలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస కల్యాణ మండపంలో పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అధ్యక్షతన భీమిలి నియోజకవర్గ స్థాయి విస్తృత కార్యవర్గ సమావేశం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సదస్సులో శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, కో ఆర్డినేటర్లు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు. నేతలంతా కలిసి 'వెన్నుపోటు పార్టీ.. వెన్నుపోటు పాలన' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నాయకులకు పార్టీ గుర్తింపు కార్డులను అందజేశారు.

### కార్యకర్తలే పార్టీకి వెన్నెముక..

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ భీమిలిలో నాయకులు వెళ్లిపోయినా కార్యకర్తలు పార్టీని వీడలేదని స్పష్టం చేశారు. కేడర్‌కు వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై ఉన్న అభిమానం, విశ్వాసానికి ఇదే నిదర్శనమని కొనియాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలోకి వచ్చేవారు వస్తుంటారని, వెళ్లేవారు వెళ్తుంటారని, అయితే కార్యకర్తలే అసలైన బలమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం దుర్మార్గమైన పాలన సాగుతోందని, ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. పార్టీ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు మాట్లాడుతూ పార్టీ బలం రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా జగన్ వెనుకడుగు వేయలేదని, కార్యకర్తల కోసమే నిరంతరం పోరాడుతున్నారని చెప్పారు. భీమిలిలో జరుగుతున్న భూ వ్యవహారాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ చంద్రబాబు రాజకీయ కుట్రలు జగన్‌కు తెలుసన్నారు. గతంలో పలువురు నేతలు పార్టీని వీడినా వెనుకడుగు వేయకుండా నూట యాభై ఒకటో స్థానాలతో పార్టీని అధికారంలోకి తెచ్చారని గుర్తు చేశారు. ఒక నాయకుడు పార్టీని వీడితే వెయ్యి మంది నాయకులను తయారు చేసే సత్తా జగన్‌కు ఉందన్నారు.

### ఐక్యంగా సత్తా చాటుదాం..

విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో పార్టీకి బలమైన కేడర్ ఉందన్నారు. కష్టకాలంలోనూ పార్టీ జెండాను మోస్తూ, ప్రజల పక్షాన నిలుస్తున్న ప్రతి నాయకుడు పార్టీకి వెన్నెముక అని కొనియాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి బలాన్ని మరింత పెంచాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, కరణం ధర్మశ్రీ, చింతలపూడి వెంకటరామయ్య, నేతలు తిప్పల దేవన్ రెడ్డి, పెదబాబు, పోతున హనుమంతు, సంకరి గిరిబాబు, పోతిన శ్రీనివాసరావు, దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు, బంకు సత్యం తదితర రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పౌల్ట్రీ రైతులకు భారీ ప్యాకేజీ!

- షెడ్ల ఆధునికీకరణకు 25 శాతం రాయితీ
- ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్ల ఏర్పాటు
- త్వరలోనే నూక బియ్యం సరఫరాకు హామీ
- పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు అండగా నిలిచేందుకు ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026-29కి కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. నూతన విధానానికి ఆమోదం తెలిపిన సందర్భంగా పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలసీని వేగంగా అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, పెట్టుబడులను ఆకర్షించి ఉత్పాదకత, ఉపాధి అవకాశాలను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం రూ.657 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిందని వివరించారు.

### రూ.657 కోట్ల కేటాయింపులు.. విద్యుత్ ఊరట..

ఈ బృహత్ ప్యాకేజీలో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోత్సాహకాల కోసం రూ.209 కోట్లు, ఇండస్ట్రియల్ పాలసీ కింద రూ.152.18 కోట్లు, పశుసంవర్ధక శాఖ ద్వారా చేపట్టే పనులకు రూ.296 కోట్లు కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. కోళ్ల ఫారాలు, హేచరీల మౌలిక వసతుల రుణాలపై 4 శాతం వడ్డీ రాయితీ కల్పించేందుకు మూడేళ్ల కాలానికి రూ.72 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. పౌల్ట్రీ రైతులపై విద్యుత్ భారాన్ని తగ్గించే లక్ష్యంతో లో-టెన్షన్ కోళ్ల ఫారాలకు యూనిట్‌కు రూ.3.75, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లకు యూనిట్‌కు రూ.4.75 చొప్పున టారిఫ్‌ను క్రమబద్ధీకరించినట్లు స్పష్టం చేశారు.

### షెడ్ల ఆధునికీకరణకు 25 శాతం సబ్సిడీ..

కొత్తగా నిర్మించే పర్యావరణ నియంత్రిత పౌల్ట్రీ షెడ్లకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.25 లక్షల పెట్టుబడి రాయితీ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పాత షెడ్లను ఆధునీకరించేందుకు సైతం 25 శాతం, గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు సబ్సిడీ వర్తిస్తుందన్నారు. అర్హత కలిగిన ఫారాలకు టర్మ్ లోన్లపై వడ్డీ రాయితీతో పాటు విద్యుత్ ఛార్జీలపై యూనిట్‌కు రూ.2 వరకు, ఏటా గరిష్ఠంగా రూ.10 లక్షల చొప్పున మూడేళ్ల పాటు విద్యుత్ సబ్సిడీ సమకూరుస్తామన్నారు. జాతీయ పశుసంవర్ధక మిషన్ కింద అర్హత కలిగిన ప్రాజెక్టులకు 50 శాతం వరకు, గరిష్ఠంగా రూ.25 లక్షల దాకా పెట్టుబడి రాయితీ పొందే అవకాశం కల్పించినట్లు వివరించారు.

### మహిళలకు ఉపాధి.. పీపీపీ ప్రాసెసింగ్ యూనిట్లు..

గ్రామీణ మహిళలకు అదనపు ఆదాయం కల్పించేందుకు బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీకి ప్రాధాన్యత ఇస్తూ స్వయం సహాయక సంఘాల ద్వారా ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. మహిళలకు 30 నుంచి 45 రోజుల శిక్షణ, టీకాలు, డే-ఓల్డ్ కోడిపిల్లల సరఫరా చేపడతామన్నారు. పౌల్ట్రీ ఉత్పత్తులకు విలువ జోడించేందుకు పీపీపీ విధానంలో చిత్తూరు, విజయవాడ, విశాఖపట్నం కేంద్రాలుగా చికెన్ ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఎగ్ ప్రాసెసింగ్ యూనిట్లను అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణాల్లో షెడ్ల నిర్మాణానికి గతంలో ఉన్న డెవలప్‌మెంట్, బెటర్‌మెంట్ ఛార్జీలను పూర్తిగా మినహాయించి గ్రామ పంచాయతీలతో సమానమైన ఫీజులతోనే అనుమతులు ఇస్తామన్నారు. ఫీడ్ వ్యయాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నూక బియ్యాన్ని పౌల్ట్రీ ఫారాలకు త్వరలోనే అందుబాటులోకి తెస్తామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# బీసీలంటేనే టీడీపీ!

- కులం పేరుతో దూషిస్తే కఠిన శిక్ష తప్పదు
- స్థానిక పోరులో బీసీ రిజర్వేషన్ల పెంపు
- గొల్లపూడిలో బీసీ రక్షణ చట్టంపై అవగాహన సదస్సు
- మంత్రి సవిత



**విజయవాడ (సమయం న్యూస్):** బీసీల ఆత్మగౌరవం పెంచేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగించడం ఖాయమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ధీమా వ్యక్తం చేశారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డికి స్థానిక ఎన్నికల ఓటమి భయం పట్టుకుందని విమర్శించారు. శనివారం విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో వివిధ బీసీ కార్పొరేషన్ల చైర్మన్లతో బీసీ రక్షణ చట్టంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఆమె ఎన్టీఆర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీలంటేనే టీడీపీ అని, నాయకులు, కార్యకర్తలు గర్వంగా తలెత్తుకుని తిరుగుతున్నారని ఆమె సదస్సులో కొనియాడారు.

### పకడ్బందీగా బీసీ రక్షణ చట్టం..

గత ఎన్నికల ముందు నారా లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు బీసీ రక్షణ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. కోర్టుల్లో నిలబడేలా చట్టానికి తుదిమెరుగులు దిద్దుతున్నామని, ఇందులో భాగంగా మంత్రివర్గ ఉప సంఘంతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సమావేశాలు నిర్వహించామన్నారు. బీసీలను కులం, వృత్తుల పేరుతో దూషించినా, సామాజిక బహిష్కరణకు గురిచేసినా చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. జిల్లాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి కేవలం రెండు నెలల్లోనే దర్యాప్తు పూర్తయ్యేలా నిబంధనలు రూపొందించినట్లు చెప్పారు. 156 బీసీ కులాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్పొరేషన్ల చైర్మన్ల నుంచి అభిప్రాయాలు తీసుకున్నామని, దేశంలోనే తొలిసారిగా ఏపీలో ఈ చట్టాన్ని తెస్తున్నామని సవిత తెలిపారు.

### 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతామని మంత్రి సవిత స్పష్టం చేశారు. నాడు ఎన్టీఆర్ తొలిసారిగా బీసీలకు రిజర్వేషన్లు అమలు చేశారని, ఆయన స్ఫూర్తితో చంద్రబాబు వాటిని 34 శాతానికి పెంచారని గుర్తుచేశారు. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ఈ రిజర్వేషన్లను 24 శాతానికి కుదించి బీసీలకు రాజకీయంగా తీవ్ర నష్టం చేశారని మండిపడ్డారు. మళ్లీ 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్పొరేషన్ల చైర్మన్లకు మంత్రి దిశానిర్దేశం చేశారు.

### కూటమి పెద్దలకు చైర్మన్ల ధన్యవాదాలు..

బీసీ రక్షణ చట్టంతో పాటు స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపునకు కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, మంత్రి సవితకు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ధన్యవాదాలు తెలియజేసి, ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, పలు కార్పొరేషన్ల చైర్మన్లు వీరంకి వెంకట్ గురుమూర్తి, నందం అబద్ధయ్య, పేరేపి ఈశ్వరరావు, నర్సింహ యాదవ్, మల్లెల ఈశ్వర్, దేవేంద్రప్ప, చిలకలపూడి పాపారావు, కొల్లు పెద్దిరాజు, సీఆర్ రాజన్, రుద్రకోటి సదాశివ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎంకు బ్రహ్మోత్సవాల ఆహ్వానం!

### సాలకట్ల వేడుకలకు చంద్రబాబుకు పిలుపు
### ఆహ్వాన పత్రిక అందజేసిన టీటీడీ బృందం
### సీఎం నివాసంలో వేద పండితుల ఆశీర్వచనం

**అమరావతి (సమయం న్యూస్):** తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని టీటీడీ ఘనంగా ఆహ్వానించింది. అమరావతిలోని ముఖ్యమంత్రి నివాసంలో టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుమల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను సీఎంకు సాదరంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, జానకిదేవితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. సీఎం నివాసంలో టీటీడీ వేద పండితులు, అర్చకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి వేద మంత్రోచ్చారణలతో ఘనంగా ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను ముఖ్యమంత్రికి బహూకరించారు. ఆహ్వాన పత్రిక అందజేసిన అనంతరం, శ్రీవారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లపై ముఖ్యమంత్రి సమీక్షించారు. తిరుమలకు వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కల్పించాల్సిన సౌకర్యాలు, పకడ్బందీ భద్రతా చర్యలు తదితర అంశాలపై టీటీడీ ఛైర్మన్, ఈవోలతో చంద్రబాబు సమగ్రంగా చర్చించారు. భక్తులకు మెరుగైన దర్శనం, వసతి కల్పించేలా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు.

# కూటమి ధర్మంతో స్థానిక పోరు!

### కలిసికట్టుగా బరిలోకి టీడీపీ, జనసేన, బీజేపీ
### వంద శాతం స్ట్రైక్ రేట్‌తో క్లీన్ స్వీప్ ఖాయం
### విజయవాడ సమన్వయ భేటీలో మంత్రి దుర్గేష్

**విజయవాడ (సమయం న్యూస్):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ధర్మాన్ని పాటిస్తూ భాగస్వామ్య పక్షాలన్నీ కలిసికట్టుగా పోటీ చేస్తాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. విజయవాడ భారతీ నగర్‌లో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన కూటమి సమన్వయ సమావేశం జరిగింది. ఈ భేటీలో టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జనసేన పార్టీ తరపున విజయవాడ తూర్పు నియోజకవర్గ, పార్లమెంట్ ఇన్‌చార్జ్ అమ్మిశెట్టి వాసు, బండి కోమలితో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### అధినేతల నిర్ణయమే ఫైనల్..

అనంతరం విజయవాడ తూర్పు నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కూటమి పార్టీల సమన్వయ కమిటీ సమావేశాలు జరుగుతున్నాయన్నారు. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య స్థానాల కేటాయింపును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ అధిష్టానం ఉమ్మడిగా నిర్ణయిస్తాయని తెలిపారు. ఏ పార్టీకి ఎక్కడ బలం ఉందో పరిశీలించి, ఆ స్థానాల్లో సదరు పార్టీ పోటీ చేసేలా చర్యలు ఉంటాయన్నారు. ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా, అత్యంత స్పష్టతతో అంతిమంగా అధినేతల ఆమోదంతోనే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ సాగుతుందని వివరించారు.

### దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది..

ప్రజాస్వామ్య విలువల పట్ల అపరిమిత విశ్వాసం ఉన్న కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా నిర్వహిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో నూరు శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమి క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలపై చేతులెత్తేసి సాధారణ ఎన్నికల్లో పోటీ పడదామని వ్యాఖ్యానించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. గత 2021 స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేసి, ఎక్కడా ఎన్నికలు జరగకుండా అడ్డుకుని, దౌర్జన్యంగా ఏకగ్రీవాలు చేసుకున్న చరిత్ర వైసీపీదని, నాడొక న్యాయం, నేడొక న్యాయమా అని నిలదీశారు.

### జనసేన శ్రేణులకు దిశానిర్దేశం..

సమన్వయ సమావేశం అనంతరం విజయవాడ తూర్పు నియోజకవర్గ జనసేన కార్యాలయంలో పార్టీకి సంబంధించి ఎంపిక చేసిన సమన్వయకర్తలు, కోఆర్డినేటర్ బృందం, సపోర్ట్ టీంతో మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా చర్చించి ఎన్నికల కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు అమ్మిశెట్టి వాసు, బొలిశెట్టి శ్రీకాంత్, బండి కోమలి, చెరుకుమిల్లి సురేష్, వేమన కిషోర్ కుమార్, తాటి శివకృష్ణ, చింతలపాటి వెంకటకృష్ణ, రుద్ర శేఖర్ నాయుడు, గాదిరెడ్డి పూర్ణ చంద్రరావు, కొప్పిరెడ్డి సూర్యనారాయణ, పాయింట్ ఆఫ్ కాంటాక్ట్స్ అక్కల గాంధీ, బొలిశెట్టి వంశీకృష్ణ, తంబళ్లపల్లి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.




# సీఎం చంద్రబాబుతో బీజేపీ నేతల భేటీ!

**కలిసిన పీవీఎన్ మాధవ్, మధుకర్ జీ**

**మోదీ పాతికేళ్ల ప్రజాసేవపై చర్చలు**

**'సేవా-సంకల్ప్ అభియాన్' కోసం సమన్వయం**



**అమరావతి (సమయం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ సమావేశమయ్యారు. అమరావతిలో జరిగిన ఈ భేటీలో పలు కీలక రాజకీయ, సామాజిక అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల పాటు నిరంతరంగా చేస్తున్న ప్రజాసేవను పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా-సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలపై నేతలు ప్రధానంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ ఉత్సవాలను ఘనంగా చేపట్టేందుకు వీలుగా సేవా, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై వారు సమాలోచనలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లే అంశాలపై ఈ సమావేశంలో లోతుగా చర్చించారు. 'సేవా-సంకల్ప్ అభియాన్'ను విజయవంతం చేసే దిశగా బీజేపీ నాయకత్వం, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సమన్వయంతో అడుగులు వేయాలని నిర్ణయించారు.

# హోర్ముజ్ భద్రతపై ఇరాన్-గల్ఫ్ చర్చలు!

**ఒమాన్ వేదికగా సోమవారం కీలక సమావేశం**

**నౌకల రాకపోకలు, రుసుముల వసూలుపై ప్రతిపాదన**

**అమెరికా వ్యతిరేకతతో సందిగ్ధంలో దౌత్యం**

**టెహ్రాన్/మస్కట్ (సమయం న్యూస్):** పర్షియన్ గల్ఫ్‌లో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నడుమ హోర్ముజ్ జలసంధి భద్రతపై ఇరాన్, గల్ఫ్ దేశాల మధ్య దౌత్య ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.



ఒమాన్ చొరవతో సోమవారం కీలక సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ భేటీలో హోర్ముజ్ జలసంధి భవిష్యత్తు, నౌకల రాకపోకలు, ప్రాంతీయ భద్రత ప్రధానంగా చర్చకు రానున్నాయి. అయితే సమావేశంలో తక్షణమే ఎలాంటి అధికారిక ఒప్పందం కుదిరే అవకాశాలు తక్కువగా ఉన్నాయని సీనియర్ ఇరాన్ అధికారి తెలిపారు. తమ షరతులను అమెరికా అంగీకరించకుండా చర్చల వల్ల ప్రయోజనం ఉండదని ఇరాన్ పార్లమెంటు జాతీయ భద్రతా కమిటీ నేత ఎబ్రహీం అజీజీ స్పష్టం చేశారు.

**రుసుముల వసూలుపై ఆసక్తి..**

హోర్ముజ్ జలసంధిలో తన ప్రాబల్యాన్ని అంతర్జాతీయంగా గుర్తించాలని ఇరాన్ గట్టిగా కోరుతోంది. ఇందులో భాగంగానే అక్కడ ప్రయాణించే వాణిజ్య నౌకల నుంచి రుసుములు వసూలు చేసే అంశంపైనా ఇరాన్ ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. అయితే అమెరికా మాత్రం ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. హోర్ముజ్‌కు మరోవైపు తీరాన్ని నియంత్రించే ఒమాన్ ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వానికి ప్రయత్నిస్తోంది. మరోవైపు ఈ ప్రాంతంలో నెలకొన్న సున్నితమైన పరిస్థితుల దృష్ట్యా బహ్రెయిన్ మాత్రం ఈ సమావేశాల్లో పాల్గొనబోమని స్పష్టం చేసింది. అమెరికాఉఇరాన్ మధ్య ఇటీవల కాలంలో మళ్లీ వరుస దాడులు, ప్రతిదాడులు చోటుచేసుకోవడంతో గల్ఫ్ ప్రాంతంలో భద్రతా వాతావరణం అత్యంత ఆందోళనకరంగా మారింది. ఈ తాజా చర్చలు కనుక విజయవంతమైతే ప్రపంచ చమురు సరఫరాపై నెలకొన్న తీవ్ర ఒత్తిడి కొంతమేర తగ్గే అవకాశం ఉందని ఆర్థిక, వ్యూహాత్మక పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# అస్సాంలో నెత్తురోడిన రహదారులు!

**రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు మృతి**

**సోనిత్‌పూర్, బిశ్వనాథ్ జిల్లాల్లో దుర్ఘటనలు**

**ప్రమాద కారణాలపై పోలీసుల ముమ్మర దర్యాప్తు**

**గువాహటి (సమయం న్యూస్):** అస్సాం రాష్ట్రంలో శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. సోనిత్‌పూర్, బిశ్వనాథ్ జిల్లాల్లో చోటుచేసుకున్న ఈ ఘోర దుర్ఘటనలతో ఆయా ప్రాంతాల్లో తీవ్ర విషాదం అలముకుంది. ప్రమాదాలకు సంబంధించిన సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలాలకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన బాధితులను వెంటనే సమీపంలోని ఆస్పత్రులకు తరలించేందుకు పోలీసులు వేగంగా ప్రయత్నాలు చేపట్టారు. అయితే దురదృష్టవశాత్తు పలువురు బాధితులు ప్రమాదం జరిగిన సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, మరికొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఈ హృదయ విదారక ఘటనలతో మృతుల కుటుంబాల్లో తీవ్ర శోకం నెలకొంది. ఈ ఘోర ప్రమాదాలకు దారితీసిన కారణాలపై పోలీసులు ముమ్మర విచారణ ప్రారంభించారు. వాహనాల అతివేగం, ఆయా ప్రాంతాల్లోని రోడ్డు పరిస్థితి సహా అన్ని కోణాల్లో లోతుగా పరిశీలిస్తున్నారు. తాజా దుర్ఘటనలతో రాష్ట్రంలో రోడ్డు భద్రతపై మరోసారి విస్తృత స్థాయిలో చర్చ మొదలైంది. ఈ ప్రమాదాలకు సంబంధించిన పూర్తి వివరాలను సమగ్ర దర్యాప్తు పూర్తియిన అనంతరం అధికారికంగా వెల్లడిస్తామని పోలీసు అధికారులు స్పష్టం చేశారు.

# ఇంటింటికీ ఆయుర్వేదం

- తక్కువ ఖర్చుతో సంపూర్ణ ఆరోగ్యం
- మధుమేహం, బీపీ, థైరాయిడ్‌కు చక్కటి పరిష్కారం
- ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**ఒంగోలు (సమయం న్యూస్):** ఇంటింటికి ఆయుర్వేదం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.భ్రమరాంబ స్పష్టం చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆరోగ్యం పొందడం ఆయుర్వేదంతోనే సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. ఒంగోలు కేశవస్వామిపేటలోని శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలోని బి.ఎం.ఆర్. కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఆయుర్వేద అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆయుర్వేద ప్రేమికులు, ఔషధ సేవనకులు పాల్గొన్నారు.

**వ్యాధులకు చక్కటి పరిష్కారం..**

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ భ్రమరాంబ మాట్లాడుతూ.. ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ప్రాంతీయ ఉప సంచాలకులు డాక్టర్ శేఖర్ రాజుల ఆదేశాల మేరకు ప్రజల్లో ఈ వైద్య విధానంపై అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. మధుమేహం, బీపీ, థైరాయిడ్, గ్యాస్ ట్రబుల్ తదితర ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేదంలో ఉన్న పరిష్కార మార్గాలను ఆమె వివరించారు. వాత, పిత్త, కఫ త్రిదోషాలు, వాటి లక్షణాలు, నివారణ మార్గాలను ఉదాహరణలతో సహా సవివరంగా తెలియజేశారు. ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా, ధ్యానంతో పాటు సమతుల్య ఆహారం ఎంతో అవసరమని సూచించారు. వీటి ద్వారా రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని, మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని స్పష్టం చేశారు.

**ఉచితంగా ఔషధాల పంపిణీ..**

అనంతరం శిబిరానికి వచ్చిన వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి, అవసరానికి అనుగుణంగా ఆయుర్వేద ఔషధాలను ఉచితంగా అందించారు. ఈ వైద్య విధానంపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంపొందించి, ప్రతి ఇంటికీ చేరువ చేసేందుకు త్వరలో 'ఇంటింటికి ఆయుర్వేదం' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. రోగాలను నియంత్రించడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించేందుకు దోహదపడే విధానం కావడం వల్లనే దీనికి ఆయుర్వేదం అనే పేరు వచ్చిందన్నారు. ఉచిత సదస్సు నిర్వహించేందుకు ముందుకు వచ్చిన డాక్టర్ భ్రమరాంబకు శ్రీ వాసవి విద్యానిధి ఆర్యవైశ్య బాలుర వసతిగృహం కోశాధికారి నూనె రామాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.



**దీర్ఘకాలిక వ్యాధులకు చెక్..**

మానవుని ఆయుష్షును పెంపొందించే వైద్య విధానం ఆయుర్వేదమని, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నియంత్రణకు ఇది ఎంతగానో దోహదపడుతుందని భాగవత ప్రచార సేవాసమితి అధ్యక్షులు ఎం.వి.ఎస్.శాస్త్రి పేర్కొన్నారు. ఆయుర్వేద ఔషధాల వినియోగం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించేందుకు సులభమైన మార్గాలు ఉన్నాయని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జిల్లెలమూడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయుర్వేదం దైవానుగ్రహంగా భావించదగిన గొప్ప వైద్య విధానమని విశ్వహిందూ పరిషత్ ప్రాంత సత్సంగ ప్రముఖ్ సోమ సుబ్బారావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కనమర్లపూడి బాలకోటేశ్వరరావు, ధనిశెట్టి రామునాయుడు, ఈమని బలరాం, వేమూరి చక్రధర పెరుమాళ్లు, పి.శ్రీనివాసులు, హరిబాబు, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆయుష్ శాఖ సిబ్బంది ఎం.రమాదేవి, ఎం.శ్రీనివాసులు రోగులకు ఔషధాలను పంపిణీ చేశారు.

# బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రావొద్దు
- అధికారులకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలు
- సచివాలయంలో మంత్రుల ఉన్నతస్థాయి సమీక్ష



**అమరావతి (సమయం న్యూస్):** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. సచివాలయంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోం మంత్రి వంగలపూడి అనిత తదితరులతో కలిసి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

**సీఎం పర్యటనకు పక్కా భద్రత..**

ఈ నెల 15న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీవారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ నేపథ్యంలో తిరుమలలో భద్రత, ట్రాఫిక్ మళ్లింపు, క్యూలైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు మంత్రులు సూచించారు. భక్తులకు తాగునీరు, అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం, వసతి, వైద్య సేవలు, పారిశుధ్యం, రవాణా తదితర సౌకర్యాల్లో ఎలాంటి లోటు లేకుండా చూడాలని మంత్రి ఆనం ఆదేశించారు.


**వదంతులను నమ్మొద్దు..**

సామాజిక మాధ్యమాల్లో వ్యాపించే వదంతులను వెంటనే గుర్తించి వాస్తవాలను వెల్లడించాలని అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు అధికారిక సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు. టీటీడీ, పోలీస్, విజిలెన్స్, రెవెన్యూ, వైద్య, రవాణా తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సాలకట్ల బ్రహ్మోత్సవాలను దిగ్విజయంగా పూర్తి చేయాలని మంత్రులు స్పష్టం చేశారు.

# సౌదీ ఆయిల్ పైప్‌లైన్‌పై డ్రోన్ దాడి!

- ఈస్ట్-వెస్ట్ లైన్ తాత్కాలికంగా మూసివేత
- రోజుకు 50 లక్షల బ్యారెళ్ల సరఫరాపై దెబ్బ
- దాడి వెనుక ఇరాన్ హస్తం: ట్రంప్

**రియాద్ (సమయం న్యూస్):** సౌదీ అరేబియాకు అత్యంత కీలకమైన ఈస్ట్ఉవెస్ట్ చమురు పైప్‌లైన్‌పై డ్రోన్ దాడి జరగడంతో అధికారులు దానిని తాత్కాలికంగా మూసివేశారు. సుమారు 1,200 కిలోమీటర్ల పొడవున్న ఈ పైప్‌లైన్ సౌదీ తూర్పు ప్రాంతం నుంచి రెడ్ సీ తీరానికి ముడి చమురును తరలిస్తుంది. హోర్ముజ్ జలసంధిలో యుద్ధ పరిస్థితులు నెలకొన్న తర్వాత ఈ పైప్‌లైన్ ప్రాధాన్యం భారీగా పెరిగింది. ఈ మార్గం ద్వారా రోజుకు సుమారు 40 లక్షల నుంచి 50 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా అవుతుందని, ఇది ప్రపంచ మొత్తం చమురు సరఫరాలో దాదాపు 4 నుంచి 5 శాతానికి సమానమని రాయిటర్స్ సంస్థ వెల్లడించింది. ఈ డ్రోన్ దాడి ఇరాక్ భూభాగం నుంచే జరిగినట్లు సౌదీ, ఇరాక్ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అయితే ఈ దాడికి తామే కారణమని ఇప్పటివరకు ఏ సంస్థా అధికారికంగా బాధ్యత ప్రకటించలేదు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం ఈ దాడి వెనుక ఇరాన్ హస్తం ఉండే అవకాశముందని వ్యాఖ్యానించారు. ఈ ఘటన జరిగిన వెంటనే ఇరాక్ ప్రభుత్వం అప్రమత్తమై మైసాన్ ప్రావిన్స్‌లో ఇద్దరు సీనియర్ భద్రతా అధికారులను విధుల నుంచి తొలగించింది. దీంతోపాటు ఇరాన్ సరిహద్దులోని ప్రధాన క్రాసింగ్‌ను కూడా ఇరాక్ అధికారులు మూసివేశారు. ఈ తాజా పరిణామాల నేపథ్యంలో సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ అమెరికా సైనిక సహాయం కోరినట్లు రాయిటర్స్ వర్గాలు తెలిపాయి. అయితే అమెరికా నేరుగా యుద్ధంలోకి దిగకుండా కేవలం



సమాచార, ఇంటెలిజెన్స్ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన ఈస్ట్-వెస్ట్ సరఫరా మార్గం మూతపడటంతో రానున్న రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలపై మరింత తీవ్ర ఒత్తిడి ఏర్పడే ప్రమాదముందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

